# సత్యవాక్యు

# The Word of Truth

## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY - 2010

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2009 డిశంబరు 25 వ తేది రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా విప్పర్రులో గొప్ప సువార్త కూటము జరిగెను. ఆ కూటమునకు ఇంచు మించుగా విప్పర్రు గ్రామస్థులందరు సంతోషముతో హాజరైరి. ఆనాటి కూటములో రిక్కీగూటం గారు దేవుని వాక్యమును శక్తి వంతముగా ఆసక్తితో బోధించిరి. వినిన వారందరు ఆత్మీయముగా బలపడిరి. విప్పర్రులో సోదరులు టి.సి. హెచ్. ఫ్లెమింగ్స్ గారు గొప్ప వ్యయ ప్రయాసలకోర్చి సువార్త చాటుచు బలమైన క్రీస్తు సంఘమును నడిపించుచున్నారు. ఫ్లెమింగ్స్‌గారు, ఆయన కుమారుడు సైలస్ గార్లు గుడివాడ, దొడ్డిగుంట, పెద్దాపురంలలో వాక్య పరిచర్య చేయుచున్నారు.

2009 డిశంబరు 26వ తేదీన అమెరికాలోని ఓక్లహోమ క్రిస్టియన్ యూనివర్సిటీ నుండియు, ఓక్లహోమ స్టేట్ యూనివర్సిటి నుండియు ఏడుగురు యువతీ యువకులు రిక్కీ గూటం గారి పనిలో సహకరించుటకు కాకినాడ వచ్చిరి. ఇంచుమించు రెండు వారముల పాటు వారు ఇక్కడ జరుగుచున్న ప్రభువు పనిలో పాలుపొందిరి. రెండు దినముల పాటు రిక్కీ గారు నడుపుచున్న చిల్డ్రన్‌హోమ్‌కు సున్నము వేసి ఆ బిల్డింగ్‌ను శుభ్రపరచిరి. చిన్న పిల్లలకు పాటలు, బైబిలు వాక్యములు, నాటికలు వగయిరా నేర్పించిరి. ఆబృందమునకు మేట్ మిల్స్‌గారు నాయకత్వము వహించిరి.

2009 డిశంబరు 29వ తేదీనాడు మేట్ మిల్స్‌గారి బృందము పశ్చిమగోదావరి జిల్లాలో కరుగోరుమిల్లి , పెనుమంచిలి, పెదగరువులలో యున్న క్రీస్తు సంఘములను దర్శించి వాక్య పరిచర్య చేసిరి. కరుగోరుమిల్లిలో యన్.. మోజెస్‌గారు, పెనుమంచిలిలో యమ్. జోసఫ్‌గారు, పెదగరువు, తామరాడలలో జి. చిట్టిబాబు గార్లు సువార్త చాటుచున్నారు.

డిశంబరు 30వ తేదీనాడు పై బృందము పిఠాపురంలో పెబ్బిలి సత్యానందం గారు ఏర్పాటు చేసిన కూటములో పాల్గొనిరి, సువార్త చాటిరి, ఆ రోజు మధ్యాహ్నం జెడ్. రాగంపేటలో నిర్మించ బడిన క్రీస్తు సంఘ ఆలయమును రిబ్బను కత్తిరించి రిక్కీ గూటం గారు ప్రభువు పనికి ప్రతిష్టించిరి. అమెరికా

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 30 | ఫిబ్రవరి - 2010 | సంచిక -7


## క్రొత్తనిబంధన సంఘమును గుర్తించుట

(Identifying the N.T Church)

నేటిలోకములో అనేక సంఘములున్నాయి గనుక క్రొత్తనిబంధన సంఘమును గుర్తించుట యెట్లో ఈ రోజు మనం తెలుసుకొందాము. లేఖనములను పరిశోధించుట ద్వారానే క్రొత్తనిబంధన సంఘమును మనము గుర్తించగలము. పాత నిబంధనలో చెప్పబడిన ప్రవచనముల నెరవేర్పే క్రొత్తనిబంధన సంఘము. అందువలన సంఘమును గూర్చి చెప్పబడిన కొన్ని పాతనిబంధన ప్రవచనములు మనము గమనించాలి.

క్రీస్తుపూర్వము 700 సంవత్సరముల కాలములో యెషయా ఇట్లు ప్రవచించాడు. "అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండలకంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోకి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము యెరూషలేములో నుండి యెహోవా వాక్కు బయలు వెళ్ళును" (యెషయా 2:2,3).

యూదులరాజ్యపు అంత్య దినములలో సంఘము స్థాపించబడును అని యెషయా ప్రవచించాడు. నజరేయుడైన యేసురాక వలన అది

నెరవేరెనని హెబ్రీ 1:1,2 చెప్పుచున్నది. యెహోవా మందిరము స్థిరపరచబడునని యెషయా చెప్పాడు. క్రీస్తుసంఘమే యెహోవా మందిరమని 1తిమోతి 3:15 చెప్పుచున్నది. సమస్త జనాంగములు దానిలోనికి వచ్చెదరని యెషయా ప్రవచించాడు. మత్తయి 28:19లో, యేసుప్రభువు, "మీరువెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి" యని తన శిష్యులకు చెప్పారు. క్రీస్తు సువార్త సర్వసృష్టికి ప్రకటింపబడుచున్నది. నేడు ఇంచుమించు ప్రపంచమందున్న అన్ని జనాంగముల మధ్య క్రీస్తుసంఘము ఉన్నది. యెరూషలేములో నుండి యెహోవా వాక్కు బయలు వెళ్ళునని యెషయా ప్రవచించాడు. లూకా 24:47 ప్రకారము క్రీస్తుసంఘము యెరూషలేములో స్థాపించబడెను. మరియు మారు మనస్సు, పాపక్షమాపణ మొట్ట మొదటిగా యెరూషలేములో ప్రకటింపబడెను.

తరువాత, సంఘము స్థాపించబడే కాలమును దానియేలు ప్రవచించాడు. దానియేలు గ్రంధము, క్రీస్తుకు 538 సంవత్సరములకు పూర్వము వ్రాయబడెను. బబులోను రాజైన నెబుకద్నెజరు కనిన కలకు దానియేలు చెప్పిన భావార్థము రెండవ అధ్యాయములో యున్నది. రోమా సామ్రాజ్యపు రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును; దానికెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దానిపొందిన వారికిగాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని వగులగొట్టి నిర్మూలము చేయునుగాని, అది యుగముల వరకు నిలుచును" అని 2:44లో ప్రవచింపబడినది.

లూకా 3:1-3 ప్రకారము క్రీస్తు రోమా సామ్రాజ్యపు రాజుల కాలములో వచ్చెను. మత్తయి 16:18లో క్రీస్తు తన సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను. అపొ.కా. 2వ అధ్యాయములోని సంఘటనలు రోమా సామ్రాజ్య కాలములో జరిగెను. క్రీస్తు వాగ్దానము చేసిన సంఘము లేక రాజ్యము ఆయన పునరుత్థానుడైన మొదటి పెంతెకొస్తు దినమున, యెరూషలేములో స్థాపించబడెను.

దానియేలు 7:13,14లో దానియేలు చూచిన దర్శనమును గూర్చి చెప్పబడినది. ఆదర్శనములో ఆకాశ మేఘారూఢుడై మనుష్య కుమారుడైన క్రీస్తు తండ్రియైన దేవుని సన్నిధిని ప్రవేశించగా, ఆయనకు ప్రభుత్వమును, మహిమయు, ఆధిపత్యమును ఈయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు.

యేసుప్రభువు తండ్రియైన దేవుని యొద్దకు ఆరోహణుడైనప్పుడు ఈ ప్రవచనము నెరవేరినట్లు, ఎఫెసీ 1:20-23; మరియు ఫిలిప్పీపత్రిక 2:5-11లో నెరవేరినట్లు మనము చూడగలము. అపో.కా. మొదటి అధ్యాయములో అపొస్తలులు చూచు చుండగా యేసుప్రభువు ఆరోహణమాయెను. అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను (అపో.కా. 1:9). గనుక అపో.కా. 2వ అధ్యాయములోని సంఘటనలు జరుగుసరికి, యేసు తండ్రి యొక్క కుడిపార్శ్వమున కూర్చుండి రాజ్యమే లుచుండెను. గనుక "మీరు సిలువ వేసిన యీ యేసునే దేవుడు ప్రభువు గాను. క్రీస్తుగాను నియమించెను. యిది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెనని" అపో. పేతురు యెరూషలేము ప్రజలకు బోధించెను (అపో.కా. 2:36).

పరిశుద్ధాత్మ కుమ్మరింపబడుటను గూర్చి ప్రవక్తయైన యోవేలు ప్రవచించాడు. "తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మను కుమ్మరింతును. మీ కుమారులును, కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు, మీ ముసలివారు కలలు కందురు, మీ యౌవనస్థులు దర్శనములు చూతురు" అని యోవేలు ప్రవచించాడు (యోహాను 2:28,29).

అపో.కా. 2వ అధ్యాయములో అపొస్తలులు పరిశుద్ధాత్మతో నింపబడుటను మనము చూడగలము. అది గొప్ప చారిత్రాత్మక సంఘటన. అపో.కా. 2:16లో పేతురు, యోవేలు ప్రవక్తద్వారా చెప్పబడిన సంగతి యిదే అని చెప్పి, వారి మధ్యను ఆనాడు ఆప్రవచనము నెరవేరినట్లు నిరూపించాడు.

అపో.కా. 2వ అధ్యాయము దేవుని రాజ్యమును గూర్చి లేదా క్రీస్తు సంఘమును గూర్చి చెప్పబడిన ప్రవచన ములన్నిటికి నెరవేర్పుగా యున్నది. ఆనాటినుండి క్రీస్తు యొక్క ఏలుబడిలేక రాజ్యము ప్రారంభమైనది. అది స్త్రీ పురుషుల యొక్క హృదయ ములలో యేసుప్రభువు యొక్క రాజరికము. అపో.కా. 2వ అధ్యాయములోని సంఘటనలు యెరూషలేములో జరిగెను. అది రోమా సామ్రాజ్యపు రాజుల కాలములో జరిగెను. దేవుడు తన ఆత్మను మనుష్యులందరి మీద కుమ్మరించెను. దావీదు సింహాసనముపై ఆసీనుడగుటకు యేసు పరలోకమునకు ఆరోహణుడై దేవుని కుడి పార్శ్వమును కూర్చుండెను. దేవుడు యేసును ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను.

అపో.కా. 2వ అధ్యాయములో జరుగుచున్న సంఘటనలు పాతనిబంధ

నలోని ప్రవచనముల నెరవేర్పేయని ఆనాడు పేతురు, యెరూషలేము ప్రజలకు నిరూపించెను. అతడు చెప్పిన మాటలను వారు విని విశ్వసించారు. దేవుని కుమారుడైన క్రీస్తును సిలువ వేసినందుకు హృదయములో నొచ్చుకొన్నారు. అయితే మేమేమి చేయవలెను? అని వారడుగగా, పేతురు "మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము మీలో ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి. అప్పుడు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని చెప్పాడు (అపొ.కా. 2:38). "కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడు వేలమంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41).

సంఘమనగా యేసుప్రభువు చిత్తమునకు లోబడి, ఆయనను ప్రభువుగా తమ హృదయముల యందు ప్రతిష్ఠించుకొని, రక్షింపబడిన వారి సమూహము. గనుక క్రొత్తనిబంధన సంఘము యెరూషలేములో, పెంతెకొస్తు దినమున, రోమా సామ్రాజ్య కాలములో స్థాపించబడెను. దానికి ముందుగాని, వెనుకగాని స్థాపించబడిన సంఘము లేమియు క్రీస్తు సంఘములు కానేరవు. నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా?

**దేవుని ఋజువులు -7**

# వృక్ష శాస్త్రములో దేవుని ఋజువు

## (Evidence of God in Botany)

విశ్వంలో నమూనాను గూర్చి యున్న బలమైన ఋజువు పచ్చటి మొక్కలలో కూడ యున్నది. వృక్షములు జంతువులు ఒక దానిపై నొకటి ఆధారపడి జీవిస్తుయుంటాయి. వృక్షములు తయారుచేయు ఆక్సిజన్, కార్బోహైడ్రేటులు లేకుండా జంతువులు జీవించలేవు. అదే సమయంలో వృక్షములు కిరణజన్య సంయోగక్రియ (Photo Synthesis) కొరకు అవసరమైన కార్బన్ డయాక్సైడ్ కొరకు జంతువులపై ఆధారపడియున్నాయి.

ఫోటో సింథెసిస్ అనగా పచ్చటి మొక్కలు, చెట్లు, నాచు, కొన్ని రకములైన బేక్టీరియా సూర్యరశ్మి వలన పంచదారను, ఆక్సిజన్‌ను తయారు చేయు విధానము.

**ఫోటో సింథెసిస్ ఫార్ములా :**

ఫోటో సింథెసిస్ యొక్క ప్రాథమిక కెమికల్ ఫార్ములా యిది: ($6CO_2 + 12\ H_2 +$ Light $>> C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O$) అంటే ఆరు మోలిక్యూళ్ల కార్బన్ డయాక్సైడ్

+ 12 మోలిక్యూళ్ల నీరు, సూర్యరశ్మి కలిస్తే ఒక మోలిక్యూల్ షుగరు, ఆరు మోలిక్యూళ్ల ఆక్సిజన్, ఆరు మోలిక్యూళ్ల నీరు తయారగును. పచ్చటి ఆకులలో ఎండవేళల ప్రతి నిత్యము యిది జరుగుచు యుండును.

**ఆకులు (Light) :**

ఎండవేళ పచ్చటి చెట్టునీడలో కూర్చుని చల్లటి వాతావరణాన్ని బట్టి నీవు ఆహ్లాదించవచ్చును. గాని నిజానికి ఆ చెట్టు యొక్క ఆకులు పనిలో యున్నాయి. ప్రతి సెకనుకు ప్రతి పచ్చటి ఆకులోను వేలకొలది కెమికల్, మరియు ఎలక్ట్రికల్ ప్రక్రియలు జరుగుచుయున్నాయి. ఇదంతా రెప్పపాటులో జరిగిపోతాది. ఫోటో సింథెసిస్‌లో జరిగే కెమికల్ రియాక్షన్ విజ్ఞాన శాస్త్రంలో చాల వేగవంతమైనది.

ఒక ఆకులోని కణములన్నియు సూర్యరశ్మిని స్వీకరించుట కొరకు, ఫోటో సింథెసిస్ జరిగించుట కొరకు నిర్మించబడినవి. కార్బన్ డయాక్సైడ్, నీరు ఆకులలోనికి ప్రవేశించును గాని, ఆక్సిజన్, షుగర్, నీటి ఆవిరి దాని నుండి బయటికి వచ్చును :

**ఆకు యొక్క నిర్మాణ పద్ధతి** (Leaf Anatomy):

ప్రతి ఆకు చక్కగా అమర్చబడిన కణములు గల బాహ్య చర్మముతో (epidermis) కప్పబడియున్నది. ఆ చర్మము క్యూటికల్ అను వాటర్ ప్రూఫ్ పదార్థముతో కప్పబడియున్నది. కార్బన్‌డయాక్సైడ్ క్యూటికల్ ద్వారాను బాహ్య చర్మము ద్వారాను ప్రవేశించలేదు. గాని ఆకులోయున్న సూక్ష్మ రంధ్రముల ద్వారా ప్రవేశించును. ప్రతి రంధ్రము ఇరువైపుల చిక్కుడు గింజలాగున్న కణములచే రక్షింపబడును. ఈ రక్షణ కణములు ద్వారము తెరిస్తేనే గాని యేదీ ఆ రంధ్రము ద్వారా ప్రవేశించదు.

ఆకులో యున్న భాగములు ఏ పని నిమిత్తము నిర్మించబడినవి? క్యూటికల్ నీరు నష్టము కాకుండా చూచును. బాహ్యచర్మము లోపలనున్న సున్నిత కణములను రక్షించును. కాపలాకాయబడుచున్న రంధ్రములు కార్బన్‌డయాక్సైడ్ లోపలికి ప్రవేశించుటకును, ఆక్సిజన్, నీటియావిరి బయటికి వచ్చుటకును పనిచేయును.

ఆకులోనికి నీరు ఎట్లు ప్రవేశించును? చెట్టు యొక్క వ్రేళ్లు భూమిలో నున్న నీటిని, పోషక పదార్థములను పీల్చుకొని కాండము ద్వారా ఆకులలోనికి పంపించును. ఆ నీరు గ్జయిలమ్ (Xylem) అనే ప్రత్యేక గొట్టము ద్వారా ప్రయాణము చేయును. అది ఆకుల దగ్గరకు వచ్చు సరికి శాఖోపశాఖల వెన్నులవలె చీల్చబడి ఆకులోని ప్రతి

కణమునకు నీరు సరఫరాచేయును.

**మీసోఫిల్ కణములు (Mesophyll Cells):**

క్యూటికిల్, ఎపిడెర్మిస్ (బాహ్మ చర్మము) రంగులేనివై క్లియర్‌గా యుండును. అందువలన ఆకు లోపలయున్న పచ్చటి కణములకు సూర్యరశ్మి నేరుగా చేరుకొన వీలగును. లోపలికణములన్నియు క్లోరోఫిల్ అను పదార్థము వలన పచ్చగా కనబడును.

మీసోఫిల్ కణములు చక్కగా ఆర్గనైజ్ చేయబడినవి. ప్రతికణములోను అనేక గదులుండును. ప్రతి గదికి ఒకపనియుండును. ఇంటిలో యున్న కిచెన్, డైనింగ్, బెడ్‌రూమ్‌లకు వేర్వేరు పనులెట్లో వీటికిని అట్లే.

మీసోఫిల్ కణములో యున్న న్యూక్లియస్‌లో DNA మోలిక్యూల్ ఉండును. న్యూక్లియస్‌లో వుండి సెంట్రల్ కమేండ్‌లాగు పని చేయును. అది RNA మోలిక్యూల్స్‌కు ఆజ్ఞయిచ్చి ఫోటో సింధెసిస్ ద్వారా ప్రోటీన్లు ఎట్లు నిర్మించాలో తెలయజేయును. RNA మోలిక్యూల్ న్యూక్లియస్‌లో జనించును గాని దాని పని చేయు నిమిత్తము అది న్యూక్లియస్‌ను విడిచివచ్చును. అది సూక్ష్మ గేటుల ద్వారా వస్తూ పోతూయుండును. ఆ గేట్లను సూక్ష్మ రంధ్రములు అందురు. ఆ రంధ్రముల గుండా కొన్ని సంగతులు మాత్రమే ప్రవేశించును. ఇచ్చిన ఆర్డర్‌ను బట్టి మీసోఫిల్ కణములో ప్రవేశించి 30 రకములైన ప్రోటీన్లను వివిధ పనుల కొరకు తయారుచేయును. ఈ ప్రోటీన్లలో కొన్ని సూక్ష్మపవర్ ప్లాంట్‌లగు క్లోరోప్లాస్ట్‌లను తయారుచేయును.

**క్లోర్‌ప్లాస్ట్ (Chlorplast):**

ప్రతి మీసోఫిల్ కణములోను అనేక క్లోర్ ప్లాస్టులుండును. ఈ క్లోరోప్లాస్ట్‌లలో ఫోటో సింధసిస్ (కిరణ జన్యసంయోగ క్రియ) సంభవించును చాల కాంప్లెక్స్ ఎలక్ట్రికల్ మరియు రసాయనిక ప్రక్రియలు సూర్యరశ్మిని షుగర్‌గా మార్చును.

క్లోర్‌ప్లాస్ట్ డబుల్ మెంబ్రేన్‌లో యుండును. దాని లోపల థైలకోయిడ్స్ అనే పొరలనేకములుండును. ఈ థైకోలోయిడ్స్ లోపల ఫోటో సింధెసిస్ యొక్క మొదటి ప్రక్రియ ప్రారంభమగును. క్లోర్ ఫిల్ పిగ్మెంటు లోని థైకోలాయిడ్‌ను సూర్మరశ్మి తాకినపుడు అది రెండు ఎలక్ట్రాన్లను విడుదల చేయును. అవి ఒక పిగ్మెంటు నుండి మరొక దానికి జంప్ చేస్తు రియాక్షన్ సెంటరుకు చేరుకొనును. అవి అక్కడ బంధింపబడి, కెమికల్ శక్తిగా మార్చబడి భవిష్యత్తులో వినియోగించబడుటకు దాచబడును. ఈ రియాక్షన్లన్నీ రెప్పపాటులో జరిగి

పోవును.

ఆశ్చర్యం యేమంటే క్లోరోఫిల్ పిగ్మెంటు ఎన్నడు ఎలక్ట్రాన్లను లేకుండాపోదు. ఎందువలన ? ప్రతి థైకోలోయిడ్‌లోను పిగ్మెంటు మాత్రమే గాక నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్ మోలిక్యూళ్ళనుగా విభజించు ఎన్‌జైముంలుండును.

హైడ్రోజన్ అణువులు కొన్ని హైడ్రోజన్ ఇయాన్లగా విభాగింపబడును. హైడ్రోజన్ ఇయాన్ల కదిలిక వలన చెట్టుకు శక్తి లభించును. నీటి నుండి గైకొనబడిన ఆక్సిజన్ మోలిక్యూళ్లకణముల గేటుల ద్వారా పోయి ఆకులోని స్టోమోట ద్వారా బయటకి వచ్చును. జంతువులకు, మానవులకు ఆక్సిజన్ ఈ రీతిగా విడుదల చేయబడును.

**కిరణజన్య సంయోగ క్రియ రెండోభాగము :**

థైకోలోయిడ్స్ తమ పనిని పూర్తి చేసిన తరువాత కిరణజన్య సంయోగ క్రియ ఆకు యొక్క ద్రావక పదార్థము దగ్గరకు చేరుకొనును. అక్కడ స్టోమోట ద్వారా ఆకులోనికి ప్రవేశించిన కార్బన్‌డయాక్సైడ్‌ను ఎన్‌జైములు తీసికొనును. అందులోని కార్బన్, హైడ్రోజన్ ఆక్సిజన్‌లతో మిశ్రమమై షుగర్‌గా తయారగును. ఆ మొక్కకు అవసరం వచ్చే వరకు ఆ షుగర్ స్టార్చ్‌లాగ స్టోర్ చేయబడును. మనం ఎప్పుడు పండ్లను తినినా, ఫోటోసింథెసిస్ యొక్క లాభములననుభవింతుము. మనం గేస్‌ను,ఆయిల్‌ను, బొగ్గును ఎన్నడు వాడినా అలానాడెప్పుడో సంభవించిన ఫోటో సింథెసిస్ యొక్క ప్రయోజనముల ననుభవింతుము.

**ముగింపు :**

ఆశ్చర్యకరమైన ఈ షుగర్ కర్మాగారాలు ఎలాగ వచ్చాయి? పచ్చటి మొక్కలు సూర్యరశ్మిని పంచదారగా తయారు చేసే శక్తిని ఎవరిచ్చారు? కిరణ జన్య సంయోగ క్రియను వివరించడానికి డార్విన్ సంబంధులకు కష్టమే. డార్విన్ తలంచినట్లు ఈ మొక్కలు అంచలంచెలుగా ఎట్లు పరిణామము జెందాయో వారు చెప్పలేరు. చెట్లు, జ్ఞానివలన నిర్మింపబడినవని తెలివి గల వారిట్టే గమనించగలరు!

"దేవుడు గడ్డిని విత్తనములిచ్చు చెట్లను భూమి మీద తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములు గల ఫల వృక్షములను భూమి మొలిపించును గాకని పలుకగా ఆ ప్రకారమాయెను" (ఆదికా. 1:11).

- రిచర్డ్ ఏడీ

# యేసు మన ......

## (Jesus is our...)

ఈలోకంలో జీవించిన వ్యక్తులందరి కంటే యేసు ప్రజల జీవితాలను మార్చేశక్తిగల వ్యక్తియని ఈ వ్యాసాన్ని చదివే వారందరు అంగీకరిస్తారు. నజరేయుడైన యేసును వర్ణించడానికి మనకున్న పదములు చాలవు. మానవుల పై యేసుకున్న ప్రభావము ఏమానవుడు ఎన్నడు కలిగి యుండలేదు. ఈ లోకంలో అనేకమంది గొప్ప వారిని గూర్చి గ్రంథాలు వ్రాయబడినా, యేసును గూర్చి వ్రాయబడిన గ్రంధములు వాటన్నిటి కంటే ఎక్కువ . అందుకే "యేసుచేసిన కార్యములు ఇంకను అనేకము కలవు.- వాటిలో ప్రతి దానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంధములకు భూలోకమైనను చాలదని నాకుతోచు చున్నదని" యోహాను వ్రాసాడు (యోహాను 21:25).

ఈ యేసుతో మనకున్న సంబంధములలో కొన్నిటిని గూర్చి ఇక్కడ తెలిసికొనుట బహుశ మనకు సహాయ కరముగా యుండును.

**యేసు మన సృష్టికర్త :**

యేసు ఆదియందు దేవునితో యుండెనని యోహాను 1:1-3 చెప్పుచున్నది. శూన్యమునుండి ఈలోకాన్ని సృజించుటలో అయన ప్రముఖ పాత్రవహించెనని మనము తెలిసికొనగలము. ఆది.కా. 1:26తో ఇది ఏకీభవించుచున్నది.

**యేసు మన మిత్రుడు :**

యేసు మన మిత్రుడనుట ఎంత ఆశ్చర్యమైన తలంపో ! మనం ఆయన అజ్ఞాపించిన వాటిని చేస్తే అయన మిత్రులమవుదుమని అయన చెప్పారు (యోహాను 15:13-15).

**యేసు మన ప్రభువు :**

బైబిలు యేసును మన ప్రభువుగా తరుచు గుర్తించుచున్నది! ఆయన ప్రభువు గనుక మనం అయన చిత్తానికి, అయన దర్శకత్వానికి తల యొగ్గాలి. అట్లు చేయకపోతే అయన మన ప్రభువు కాలేరు.

**యేసు మన రక్షకుడు :**

యేసు మన రక్షకుడనే భావం నిజంగా మన కెంతో ప్రీతికరము. పాపపు అపరాధమునుండి, పాపము యొక్క శిక్ష నుండి అయన మనలను రక్షించారు (మత్త 1:21).

**యేసు మన విమోచకుడు :**

యేసు మనలను తిరిగి కొన్నారు, అయన మనలను విమోచించారు. "అయన సమస్త

దుర్నీతి నుండి మనలను విమోచించి, సత్ క్రియల యందాసక్తిగల ప్రజలను తన కోసము పవిత్ర పరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్నుతానే మన కొరకు అర్పించుకొనెను" (తీతు 2:14).

**ఆయన మన గొర్రెపిల్ల :**

మోషే ఆజ్ఞాపించిన పాప పరిహారార్థబలి స్పష్టము. మచ్చలేని గొర్రె పిల్ల పాప పరిహారార్థబలిగా దేవునికి అర్పించబడాలి. యేసు మాత్రమే కల్మషము లేని దేవుని గొర్రెపిల్లయై యున్నాడు. "పితృ పారంపర్యమైన మీవ్యర్థ ప్రవర్తనను విడిచి పెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయమైన వస్తువుల చేత మీరు విమోచింప బడలేదు గాని అమూల్యమైన రక్తము చేత, అనగా నిర్దోషమును, నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడితిరి" (1పేతురు 1:18-19).

**ఆయన మన పాపములకు ప్రాయశ్చిత్తము :**

"యేసు మన పాపములకు శాంతికరమై (ప్రాయశ్చిత్తమై) యున్నాడు. మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకు శాంతికరమై యున్నాడు" అని యోహాను వ్రాసాడు (1యోహాను 2:2).

**యేసు మన శాంతి, సమాధానము :**

"ఆయన మన సమాధానమై యుండి మీకును మాకును ఉండిన ద్వేషమును, అనగా విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి, మన ఉభయులను ఏకము చేసెనని" పౌలు వ్రాసాడు (ఎఫెసీ 2:14).

**యేసు మన మాదిరి :**

ఆయన పరిపూర్ణ మానవుడు. పాపము చేయలేదు. గనుక అన్ని విషయములలోను మనకు మంచి మాదిరి. "క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగు జాడలయందు నడుచు కొనునట్లు మీకుమాదిరి యుంచి పోయెను, ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏకపటము కనబడలేదు, ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు, శ్రమ పెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను" (1 పేతురు 2:21-23).

**యేసు మన కాపరి :**

క్రైస్తవులముగా మనం ఆయన మేపు గొర్రెలకొరకు ఆయన నమస్తాన్ని అర్పించారు (యోహాను 10:11-16). మన ప్రభువు మన కాపరి గనుక సంతోషించుదము.

**యేసు మన ప్రధాన యాజకుడు :**

యేసు మన దరపున దేవుని సన్నిధిని బలులు అర్పించు ప్రధాన యాజకుడు.

ఆయన మన బలహీనతలయందు సహానుభవము కలిగినవాడు గనుక, శోధింపబడినను పాపము చేయలేదు గనుక తండ్రియైన దేవుడు యేసు మన కొరకు చేయు విజ్ఞాపనల నాలకించును (హెబ్రీ 4:14-15).

**ఆయన మన ఉత్తరవాది, మధ్యవర్తి :**

క్రైస్తవులమైన తరువాత కూడ మనం పాపము చేస్తు యుంటాము. గాని మనం మారు మనస్సు పొంది తండ్రిని క్షమాపణ వేడు కొనునప్పుడు దేవుని యెదుట యేసు మన కొరకు విజ్ఞాపనము చేయును (1యోహాను 2:1; రోమా 8:34; హెబ్రీ 7:25; 1 తిమో 2:5).

**యేసు మన తీర్పరి :**

గొప్ప అంత్యదిన మందు యేసు అందరికీ తీర్పు తీర్చును (2 కొరింథీ 5:10). ఆయన తీర్పు న్యాయమైనదై యుండును. ఆయన తీర్పు నిష్పక్ష పాతమైనది. ఆయన బుద్ధి జ్ఞానములకు అది గొప్ప నిదర్శనము. (మత్త 25:31-46).

**యేసు మన నిరీక్షణ :**

నిరీక్షణ లేకపోతే మానవ జాతి గొప్ప దీన స్థితిలో యుండును. యేసే మన నిరీక్షణ యైయున్నాడని పౌలు చెప్పుచున్నాడు (1 తిమోతి 1:1). యేసుకు విధేయత చూపకుండా మరణించువారు నిరీక్షణ లేని వారు. గాని ఆయన మాటలు విని, విధేయత చూపిన వారు నిరీక్షణ వర్త మానమును యితరులకు అందిస్తారు. యేసు మన నిరీక్షణయై యున్నాడు.

యేసును గూర్చి ఇంకా మనం అనేకములు చెప్పుకొనగలము. గాని ప్రస్తుతానికి యివి చాలును. "చెప్పశక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము"! (2 కొరింథీ 9:15).

– బైరన్ నికల్స్

# రక్షణ, ఎవరికి అవుసరము?

## (Salvation, who needs it ?)

"సహోదరులారా, మీపిలుపును ఏర్పాటును నిశ్చయము చేసికొనుటకు మరి జాగ్రత్తపడుడి" (2 పేతురు 1:10). "జీవముకు పోవు ద్వారము ఇరుకును ఆదారి సంకుచితమునై యున్నదని" యేసు శెప్పెను (మత్త 7:13-14). పర లోకములో ప్రవేశించుట ఎంత కష్టమో యేసుచెబితే, దానిని గూర్చి శిష్యులు ఆశ్చర్యపడిరి. ప్రభువా రక్షణ పొందువారు కొద్దిమందేనా? అని వారయన నడిగిరి (మత్త 19:23-26; లూకా 13:23:24). అలాగైతే ఎవడు

రక్షణ పొందగలడని వారడిగిరి. గనుక ఎవరు రక్షణ పొందగలరో, రక్షణ ఎవరికి అవుసరమో తెలిసికొందము.

**భక్తి పరులకు రక్షణ అవుసరము (అపో.కా. 2:1-47):**

క్రీ॥శ॥ 33లో యేసు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకోస్తునాడు యెరూషలేములో ఆకాశము క్రింద నుండు ప్రతి జనములో నుండి వచ్చిన భక్తిగల యూదులు కాపురముండిరి (అపో.కా. 2:5). వారు పలు ప్రాంతముల నుండి, బహు దూరము నుండి, వ్యయ ప్రయాసల కోర్చి అక్కడ కూడి యుండిరి. అంత భక్తి శ్రద్ధలు గలవారికి రక్షణ అవుసరమా? వారు నశించినస్థితిలో యున్నారని, రక్షింప బడుటకు చర్య తీసికోవాలని పేతురు వారికి బోధించాడు (అపో.కా. 2:22, 37-38). యేసునందు విశ్వసించి, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము వారు బాప్తిస్మము పొందాలని పేతురు మూడు వేల మందిని ఆనాడు ఒప్పించాడు (అపో.కా. 2:37-41). బాప్తిస్మము పొందిన వారిని ప్రభువు తన సంఘముతో చేర్చెనని గ్రంథ కర్తయైన లూకా వ్రాసాడు (అపో.కా. 2:47).

నేడు కూడ భక్తి పరులైన వారనేకులకు రక్షణ అవుసరము. వారు మార్పు జెందాలి. భక్తి కంటె ఎక్కువను దేవుడు చూచుచున్నారు. అట్టి వారి భక్తి పూర్వక చర్యలు ఆయన వాక్యము ననుసరించి యున్నావో లేదో యని ఆయన గమనించుచున్నారు (కీర్తన 19:8). అబద్ధ సిద్ధాంతములకు, మతశాఖలకు కట్టుబడి భక్తిగా యుంటే రక్షింపబడలేము (గలతీ 1:6-9; రోమా 9:2-3; 10:1-3).

**'అద్భుతముల' వలన మోసగించబడిన వారికి రక్షణ అవుసరము :**

గారడీ వాడైన సీమోను బహు కాలము గారడీ చేయుచు సమరయ ప్రజలను విభ్రాంతి పరచుచుండెను. దేవుని మహాశక్తియనబడిన వాడు ఇతడేయని వారు చెప్పుకొనుచుండిరి ( అపో. కా. 8:10-11). గాని వారు దేవుని యొక్క నిజ శక్తిని చూచి, ఆయన సత్యవాక్యమును ఫిలిప్పు ద్వారా విని వారు యేసువైపు మార్పుజెంది బాప్తిస్మము పొందిరి (అపో.కా. 8:12). వారివలెనేడు కూడ అనేకులున్నారు.

సీమోనులాంటి గారడీవాళ్లు నేడు అనేకులున్నారు. వారు గొప్ప 'అద్భుతములు చేయు', "స్వస్థత వరము" గల భక్తులమని ప్రకటించుకొంటారు. దేవుని మర్మములు తమకు తెలియునని, భవిష్యత్తును చెప్పగలమని వారు ప్రకటించుకొంటారు. అనేకులు ఈ గారడీ వారిని సమరయులవలె వెంబడిస్తారు. అయితే ప్రజల నేలాగు ప్రలోభపెట్టాలో, వారి 'అద్భుత

క్రియలు' తెరవెనుక ముందే ఏలాగు ప్రాక్టీసు చేసు కొంటారో ప్రజలకు తెలియదు. వారు సైకాలజీ చదువుదురు, వారి దగ్గరకు వచ్చే 'రోగులను' ముందే వాళ్లు ఇంటర్‌వ్యూ చేస్తారు. వారి గారడీలో ఏకీభవించిన వారు, గారడీ చేస్తున్నవారు కూడ సత్యము లోనికి మరలాలి.

ఇప్పుడు అద్భుతములన్నీ ఆగిపోయినవి (1 కొరింథీ 13:8-10). గాని యేసు పనిచేయుట విరమించు కోలేదు. ఆయన యొద్దకు వచ్చువారిని ఆయన ఇప్పుడును రక్షించుచున్నారు (మత్త 11:28-30). బైబిలును బట్టియే మనకు తీర్పు తీర్చబడును గనుక, మన భక్తి విశ్వాసములు మన అభిప్రాయములు, మనోభావముల పై గాక బైబిలుపైనే ఆధారపడి యుండవలెను.

**నిష్కపటులేగాని సత్యమునకు విధేయులు కాని వారికి రక్షణ అవుసరము: (అపొ.కా. 10:1-48):**

కొర్నేలి చాల మంచి వాడు, భక్తిపరుడు, దానధర్మములు చేయువాడు (అపొ.కా. 10:2). రక్షణ పొందనక్కర్లేని వాడుగా కొర్నేలి మనకగుపడతాడు. అయితే రక్షణ పొందుటకేమి చేయవలెనో తెలిసికొనుటకు పేతురుకు కబురు పంపమని అతనికి తెలయజేయబడినది (అపొ.కా. 10:48). నేడు అనేకులు సత్ప్రవర్తన గలవారు, దానధర్మములు చేస్తారు, చట్ట ప్రకారము జీవిస్తారు. బహుశా ఆదివారం చర్చికి వెళ్తారు. అయితే "మంచి వాని గాయుంటేనే సరిపోదు. బాప్తిస్మము పొంది వారు క్రీస్తుసంఘ సభ్యు లవ్వాలని" కొర్నేలి వారికి సలహా నిచ్చుచున్నాడు (గలతీ 3: 26-27).

**దేవుని వాక్యమును బొత్తిగా ఎరుగని వారికి రక్షణ అవుసరము (అపొ.కా. 10:30-34):**

ఫిలప్పియిలో పౌలు సీలాలను బంధించి యుంచిన చెరసాల అధిపతి యూదుడు కాదు. అందు వలన రాబోవు రక్షకుని గూర్చి పాతనిబంధన చెప్పునది అతడెరిగిన వాడు కాదు (అపొ.కా. 16:31). అతడు ప్రభువైన యేసునందు విశ్వాసముంచవలెనని పౌలు, సీలాలు చెప్పగా అతడును, అతనియింటి వారును బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 16:34). గనుక క్రీస్తును గూర్చి ఎరుగనివారు ఆయనను గూర్చి విని, విశ్వసించి బాప్తిస్మము పొంది రక్షణ పొందుట అవుసరం.

**పాపములో జీవించుచున్న వారికి రక్షణ అవుసరము (అపొ.కా. 18:8):**

మొదటి శతాబ్దములో కొరింధులో యున్నవారు అక్రమము, అవినీతితో జీవించుచున్నారు. వారికి సువార్త బోధించుటకు అపొ. పౌలు భయపడ్డాడు (అపొ.కా. 18:9-10; 1 కొరింధి 2:3). గాని ప్రభువు పౌలును కొరింధునకు పంపించారు

దేవుని వాక్యమును విని అనేకులు విశ్వసించి బాప్తిస్మము పొందారు. ఎంత ఘోరపాపిపైనను రక్షించే దేవుని శక్తి సువార్తయై యున్నది (రోమా 1:16).

త్రాగుబోతులు, వ్యభిచారులు, దొంగలు, మాదక పదార్థముల బానిసలు మొదలైన వారినందరినీ మార్చగలిగే శక్తి సువార్తలో యున్నది. యేసు ప్రభువు పాపులతోను సుంకరులతోను సహవాసము చేసారు. వారిని బాగు చేసారు (లూకా 7:34). నేడు కూడ ఆయన అట్టి వారిని బాగు చేస్తారు. ప్రజలు మారుదురు. అది సులభం కాదుగాని, అది సాధ్యమే. నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగలనని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 4:43). నీవు పాపములో జీవించు వాడవైతే రక్షణ నీకవుసరము.

**గతంలో సరిగా బాప్తిస్మము పొందని వారిని రక్షణ అవుసరం: (అపొ.కా. 19:1-6):**

ఎఫెసు పట్టణంలో పౌలు గతంలో బాప్తిస్మము పొందిన కొందరి శిష్యులను కనుగొన్నాడు. అయితే వారు సరిగా బాప్తిస్మము పొందలేదు గనుక వారు ప్రభువైన యేసునామమున బాప్తిస్మము పొందాలని వారికి బోధించాడు. నేడు కూడ గతంలో పలువిధలుగా, పలు కారణాల కొరకు బాప్తిస్మము పొందిన వారున్నారు. కొందరు పసి పిల్లలుగా యున్నప్పుడో, పెద్ద లైనప్పుడో చిలకరింపు పొంది యుండవచ్చును. మరికొందరు బాప్తిస్మము నకు ముందే రక్షింపబడ్డారని బోధింపబడి యుండవచ్చును, ఇంకా కొందరు వేర్వేరు విధానాల్లో బాప్తిస్మము పొంది యుండ వచ్చును. ఇట్టివారందరు రక్షింపబడాలంటే క్రీస్తు బోధించిన బాప్తిస్మము పొందాలి (మార్కు 16:16; అపొ.కా. 22:16; 1 పేతురు 3:21; అపొ.కా. 2:38).

రక్షణ ఎవరికి అవుసరము? మనందరికీ యని మనమెరుగుదుము. దేవుడు నిన్ను రక్షించాలని కోరుచున్నారు. సాతాను నిన్ను తన పక్షమున చేర్చుకోవాలనుకొను చున్నాడు. నీవెవరి పక్షమున నుంటావు ?

– అలెన్ వెబ్‌స్టర్

# మనము ఒప్పుకొన వలెనా?

## (Must we make a Confession ?)

"మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును" అని యేసు చెప్పెను (మత్త 10:32). బైబిలు ప్రకారము క్రీస్తును ఒప్పుకొనుట అంటే ఆయన యందలి విశ్వాసమును ప్రకటించుట మరియు ఆయన అధికారమును స్వీకరించుటయని అర్థము.

తానెవరినని జనులు చెప్పుకొను చున్నారని యేసు తన శిష్యులనొకమారు అడిగెను. కొందరాయనను బాప్తిస్మమిచ్చు యోహానని యు, కొందరు యిర్మీయా యనియు, మరికొందరు ప్రవక్తలలో ఒకడనియు తలంచుచున్నారనివారు జవాబిచ్చిరి. అందుకాయన మీరైతే నేను ఎవడినని చెప్పుకొనుచున్నారని వారినడిగెను. అందుకు సీమోను పేతురు నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు అనిచెప్పెను "(మత్త 16:15-16). ఇవ్విధముగా పేతురు క్రీస్తును ఒప్పుకొనెను.

"యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతికలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును రక్షణకలుగునట్లు నోటితో ఒప్పుకొనును" అని పౌలు చెప్పెను (రోమా 10:9-10). రక్షణకలుగునట్లు నోటితో ఒప్పుకొనవలెను గనుక దానిని సంకుచితము చేయరాదు. హృదయ పూర్వక విశ్వాసాన్ని బహిరంగ ఒప్పుకోలుతో పౌలు జతగూర్చాడు.

అయితే క్రీస్తును ఒప్పుకొనుట ఒక మంత్రము వంటిది కాదు. హృదయములో యున్న విశ్వాసాన్ని బహిరంగపర్చే విధానమది. ఒప్పుకొనుట ద్వారా మన జీవితంలో అన్ని విషయాలలోను ఆయన అధికారమును స్వీకరించుదుము మరియు ఆయనకు, ఆయన పనికి మన వ్యక్తిగత పూచీకత్తును యిస్తాము.

రాణియైన కందాకే యొక్క ఆర్థికమంత్రి యెషయా వ్రాసిన ప్రవచన భాగమును గ్రహింపక యుండగా, సువార్తికుడైన ఫిలిప్పు ఆ లేఖనము ననుసరించి అతనికి యేసును గూర్చిన సువార్త ప్రకటించెను (అపో.కా. 8:35). వారు త్రోవలో వెళ్లుచుండగా నీళ్లున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు - ఇదిగో నీళ్లు ; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపుమని

ఆజ్ఞాపించెను. అందుకు ఫిలిప్పు నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు - యేసు క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను. ఆ ఒప్పుకోలుపై ఆధారపడి ఫిలిప్పు అతనికి బాప్తిస్మ మిచ్చెను (అపో.కా. 8:36-37).

ఆయన మన కొరకు చేసిన త్యాగము వలన, ప్రతి మోకాలును యేసు నామమున వంగునట్లును, ప్రతీ నాలుకయు యేసు ప్రభువని ఒప్పుకొను నట్లును అన్ని నామముల కంటే పై నామమును తండ్రియైన దేవుడు ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పీ 2:10-11). ఆత్మీయవిషయాల్లో నిస్వార్థతత్వమునకు ఒప్పుకోలు జన్మస్థలమని చెప్పబడింది. నీవు నిస్సందేహంగా, నిస్వార్థంగా క్రీస్తును ఒప్పుకొన్నావా?

- బాబీపిఛర్డ్

# స్త్రీ బోధింప వచ్చునా ?

## (Can a Woman Teach ?)

స్త్రీ బహిరంగ ప్రదేశములలో బోధింపవచ్చునా? అనే ప్రశ్న వచ్చినపుడు దాని జవాబు కాదు, లేదు, కూడదు అని వచ్చును. దేవుని వాక్యము ఈ విధముగ చెప్పుచున్నది "స్త్రీలు సంఘములో మౌనముగ యుండవలెను; వారు లోబడి యుండవలసిన వారేగాని, మాట లాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. వారు యేమైనను నేర్చుకొనగోరిన యెడల, ఇంట తమ తమ భర్తలనడు గవలెను; సంఘములో స్త్రీ మాట లాడుట అవమానము (1 కొరింథీ 14:34-35). స్త్రీ మౌనముగా యుండవలసినదేగాని, ఉపదేశించుట కైనను, పురుషుని మీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను. మొదట ఆదామును తరువాత హవ్వయును నిర్మింపబడిరి కారా? మరియు ఆదాము మోసపరచబడ లేదు గాని, స్త్రీ మోసపరచబడి అపరాధములో పడెను" (1 తిమోతి 2:12-14).

మన అనుదిన జీవితములో మన మందరము ప్రతి దినము మనము బోధించుచునే యుందుము. బోధించుట యనేది బహిరంగ సమాజములలో

చెప్పుదానికంటె కొంత ఎక్కువ ప్రాధాన్యతను సంతరించు కొనుచున్నది.

1. ఇతరుల యెడల మన ప్రవర్తన ద్వారా మనము బోధించుదుము. యౌవ్వనస్థుడైన తీతుకు అపొస్తలుడైన పౌలు ఈ విధముగ వ్రాయుచున్నాడు. " దేవుని వాక్యము దూషింపబడకుండునట్లు, యౌవన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి తమ భర్తలను, శిశువులను ప్రేమించువారును, స్వస్థ బుద్ధి గలవారును, పవిత్రులును, ఇంట ఉండి పనిచేసుకొనువారును మంచి వారునై యుండవలెననియు బోధించుము" (తీతు 2:5). యౌవ్వనస్థులైన విధవ రాండ్రను గూర్చి తిమోతికి ఈ విధంగ వ్రాయుచున్నాడు. "కాబట్టి యౌవ్వన స్త్రీలు వివాహము చేసికొని, పిల్లలనుకని, గృహ పరిపాలన జరిగించుచు, నిందించుటకు విరోధికి అవకాశమీయ కుండవలెనని కోరుచున్నాను". (తిమోతి 5:14). దీనిని బట్టి మనమందరము మంచి విషయము లనుగాని, లేక దేవునికి, ఆయన ప్రజలైన వారికిని అవమానకరమైన, లేక నిందతోకూడిన మాటలను గాని బోధించుచునే యుందుము. ఈ విధముగ మనము యితరుల మధ్య జీవించు చుందుము.

స్త్రీలు నిరంతరము ఇంటిలో బోధించుచునే యుంటారు కొంత మంది క్రైస్తవ స్త్రీలు అన్యులకు వివాహము చేయబడుదురు, పేతురు కొన్ని సలహాలు వ్రాయుచున్నాడు. "అటువలె స్త్రీలారా, మీరు మీ స్వంత పురుషులకు లోబడి యుండుడి. అందువలన వారిలో యెవరైనను వాక్యమునకు అవిధేయులైతే, వారు భయముతో కూడిన మీ పవిత్ర ప్రవర్తనను చూచి, వాక్యము లేకుండనే తమ భార్యల నడవడి వలన రాబట్ట బడవచ్చును (1పేతురు 3:1,2).

భార్యక్రైస్తవురాలైయుండి, భర్త అన్యుడయినచో తన భార్య యొక్క విశ్వాస జీవితమును బట్టియే వాని రక్షణ ఆధారపడి యుండును. అయితే ఆమె తన విశ్వాస జీవితమునందు వెనుకబడి యుండి ఆరాధనలకు క్రమముగ వెళ్లక, తన అనుదిన ఆత్మీయాభివృద్ధిని గూర్చి నిర్లక్ష్యము వహించునట్లు ఇతరులకు బోధింపక యుండినచో ఆమె తన భర్తకు ఒక అడ్డుబండగా యుండును, ఆమె తన ప్రవర్తన ద్వారా, సువార్త విషయములో తన భర్తకు గ్రుడ్డి తనము కలుగ జేయును.

అయితే ఆమె ప్రేమ, గౌరవములతో ముందుగా దేవునిని తన జీవితము లోనికి ఆహ్వానించిన యెడల ఆమె పవిత్ర ప్రవర్తనను బట్టి ఆమె భర్త, బిడ్డలు కూడ నేర్చుకొనెదరు.

విశ్వాస జీవితమును నేర్చుకొనుట

యందు బిడ్డలకు యింటి యందే తల్లి బోధించును. "నీ యందున్న మిక్కటమైన విశ్వాసమును జ్ఞాపకము చేసికొని, నాపితురాచారప్రకారము నిర్మలమైన మనస్సాక్షితో నేను సేవించుచున్న దేవుని యెడల కృతజ్ఞుడనై యున్నాను. ఆవాక్యము మొదట నీ అవ్వ అయిన లోయిలోను, నీతల్లి యైన యూనీకే లోను నివసించెను; అది నీయందు సహవసించుచున్నదని నేను రూఢిగా నమ్ముచున్నాను" (2 తిమోతి 1:5). తిమోతి యొక్క తండ్రి అన్యుడు. క్రొత్త నిబంధన విశ్వాసమున కాధారమైన పాత నిబంధనలోని విషయములు వాని కేమియు తెలియవు. తిమోతి తన అవ్వనుండియు, తల్లినుండియు ఆ విషయములన్నింటిని బాల్యమందే నేర్చుకొనెను. తన అవ్వయు, తల్లియు బహుజాగ్రత్తతో తిమోతికి వారు చిన్న బిడ్డగ యున్నపుడే నేర్పిరి. తరుణము దొరకినప్పుడెల్లను వారి ప్రవర్తన ద్వారా యింటి లోనే వారు దేవుని వాక్యమును బోధించుటకు స్వేచ్ఛా పరులైయున్నారని పై ఉదహరింపబడిన దానిని బట్టి తెలియుచున్నది. అయితే తన కుటుంబ సభ్యులు కాని వారికి స్త్రీ బోధింప వచ్చునా?

పౌలు ఏథెన్సు నుండి బయలుదేరి కొరింధునకు వచ్చిపొంతు వంశీయుడైన అకుల అను ఒక యూదుని, అతని భార్య అయిన ప్రిస్కిల్లను కనుగొని వారి యొద్దకు వెళ్లెను. వారు వృత్తికి డేరాలు కుట్టువారు, పౌలును అదే వృత్తిగల వాడు గనుక వారితో కాపురముండెను. వారు కలసి పని చేయుచుండిరి. ప్రిస్కిల్ల, అకుల ముందు గనే అనగా అప్పటికే క్రైస్తవులయి యుండిరో లేక పౌలు ద్వారా వారు క్రైస్తవులగ మార్చబడిరో ఆ విషయములు గ్రంధములో వ్రాయబడి యుండలేదు. పౌలు కొరింధును విడిచి వెళ్లుచున్నపుడు వీరు ఎఫెసువరకు పౌలుతో కూడ వెళ్లిరి. అచ్చట వారు విద్వాంసుడును, లేఖనముల యందు ప్రవీణుడునైన అపొల్లో అను యూదుని కనుగొనిరి. ఈ విషయములను అపొ.కా. 18:2,24,25,26లో మనము చూడగలము. వారు అపొల్లో మాటలు వినినప్పుడు అతని చేర్చుకొని దేవుని వాక్యము మరి పూర్తిగా అతనికి విశద పరచిరి (26వ). ఈ వాక్యములను బట్టి చూచినట్లయిన అపొల్లోకు ప్రిస్కిల్ల అకుల యిరువురును కలసి అతనికి బోధించినట్లు తెలియుచున్నది. ఈ బోధన ఆరాధనకు పయోగించు సునగోగులో గాని, సమాజ మందిరములో గాని జరిగి యుండక పోవచ్చును. కనుక యిది బహిరంగ బోధనలోనికి రాదు. అతనికి వారి యింటి దగ్గరనే బోధించినట్లు వాక్యము ద్వారా గ్రహించగలము. స్త్రీలు కూడ బోధనలో పాలుపొందుటకు వీలుగా చాల మంది యిండ్లలో బైబిలు తరగతులు

జరుగుచున్నవి. అట్టి సమయములలో బోధించు స్త్రీ క్రైస్తవ స్త్రీవలె ప్రేమతో, మృదువుగా బోధించవలెను.

అనేక ముద్రణా యంత్రాంగములుండి అనేకములైన పుస్తకములు ముద్రింప బడుచున్న ఈ దినములలో స్త్రీతో వ్రాయబడిన పుస్తకముగాని, ఒక ప్రత్యేక విషయము గాని పురుషుడు చదువుట పొరబాటా? అను ప్రశ్న కొన్ని సార్లు లేవనెత్తబడును, ఇది ఒక గృహములో జరిగే బైబిలు కూడికలో స్త్రీ బోధించుటతో సమానము, దీనికిని, బహిరంగ బోధనకును సంబంధము లేదు. పురుషుడు స్వేచ్ఛా పరుడై తన కిష్టమైతే వ్రాయవచ్చు, లేదా మానవచ్చు. తన నాయకత్వమునకు యెట్టివిధమైన ఒత్తిడిలేదు.

స్త్రీ బహిరంగముగ బోధించిన దాఖలా లేమైన గలవా? వృద్ధస్త్రీలను గూర్చి పౌలు తిమోతి కిచ్చుచున్నటు వంటి సలహాలు: "వృద్ధ స్త్రీలు కొండెే కత్తెలును, మిగుల మద్యపానాసక్తులునైయుండక ప్రవర్తన యందు భయభక్తులు గల వారై యుండ వలెననియు, దేవుని వాక్యము దూషింపబడ కుండునట్లు, యౌవ్వన స్త్రీలు తమ భర్తలకు లోబడి యుండి తమ భర్తలను శిశువులను ప్రేమించువారును, పవిత్రులును, ఇంట ఉండి పనిచేసుకొను వారును, మంచి వారునై యుండ వలెననియు బోధించుము, (తీతు 2:3-5). దీనిని బట్టి స్త్రీలు యితర స్త్రీలకు బోధింపవలెనని చెప్పబడుట యే గాక ఆజ్ఞాపింపబడు చున్నారు. ఆ స్త్రీలు తమ బిడ్డలకు బోధించవలెను. పురుషులు హాజరుకాని స్థలములలో అనగా సెమినార్సులోను, వర్కు షాపులలోను, చిన్న కూడికలలోగాని, పెద్ద కూడి కలలోగాని వారు బోధింపవచ్చును.

స్త్రీలచే యేర్పాటు చేయబడిన కొన్ని చిన్న సంఘములు కూడ గలవు. అట్టి పరిస్థితులలో వారు చేయవలసిన పని యేమిటి? వారి సంఘములో పురుషుడు లేనందున వారు ఆరాధనను మానుకొన వలెనా? లేదు సంఘములోని వారందరు స్త్రీలే అయి యుంటే వారు క్రైస్తవుడైన పురుషుడు అచ్చట లేనంత వరకు వారు ఆరాధనలను వారే నడుపుకొన బాధ్యులై యున్నారు.

స్త్రీ బోధింపవచ్చునా అను దానికి సమాధానము దొరికినది. మరి యొక ప్రశ్న నాయకత్వమును గూర్చినది. పురుషులు కూడి యుండు బహిరంగ సమావేశములో స్త్రీ బోధింపకూడదు. పురుషులు హాజరగు బహిరంగ కూడి కలలో క్రైస్తవులైన పురుషులే ఆరాధన విషయమైన పనులన్నిటి యందును పురుషులే నాయకత్వము వహించి, బోధించవలెను. ఇది దేవుని ద్వారా వారికీయబడిన బాధ్యత. అట్లు కాక విద్యావంతురాలైన స్త్రీ ఉన్నదని ఆమెను పిలిచి ఆబాధ్యత స్త్రీకి అప్పగించిన యెడల ఆ పురుషుడు దేవునికి

అవిధేయుడగును.

బిడ్డలకు, ఇతర స్త్రీలకు, అవిశ్వాసులకు బోధించుటయనేది చాల గొప్ప విషయము. సమయము కూడ గడచిపోవును. స్త్రీలు ఆ పనిని బాగుగా నిర్వర్తించగలిగిన యెడల అనేక మంది దేవునితో నిత్య జీవములో కలసి జీవించగలరు. స్త్రీలు యేమి చేయలేరు అను అంశముపై చర్చలు, చమత్కారములు మాని వారు యేమి చేయగలరు అనుదాని గూర్చిన ఆలోచన కలిగి యుందము.

- బెట్టీ ఫోట్

## భిన్నమైన వారితో జీవించుట
### (Living with difficult People)

"వారు తనతోకూడ యుండు నట్లును దయ్యములను వెళ్లగొట్టు అధికారము గలవారై సువార్త ప్రకటించుటకును వారిని పంపవలెనని ఆయన పండ్రెండుమందిని నియమించెను" (మార్కు 3:14-15).

యేసు యొక్క పండ్రెండు మంది అపొస్తలులు ఒక్కొక్కరి నుండి వేరుగా యున్న వ్యక్తులు. వారి యొక్క వ్యక్తిత్వములోను మనస్తత్వములోను యున్న తారతమ్యాన్ని గమనించు.

**పేతురు యోహానులు** భిన్నమైనవారు. పేతురు తొందరపాటు గలవాడు. వెంటనే మాట్లాడేస్తాడు. యోహాను నెమ్మదిపరుడు, బహుళ ప్రార్థనాపరుడు. అతడు "యేసు ప్రేమించిన శిష్యుడు". గాని నిజానికి అతడు కోపిష్టుడు, పగతీర్చుకొనే స్వభావము గల వాడు (లూకా 9:54). క్రీస్తు రాజ్యములో ప్రథమస్థానమున భ్యర్థించి అతడు, యాకోబు కూడ మిగతా వారికి కోపము పుట్టించారు.

**నతనియేలు, తోమాలలో** కూడా కొన్ని వ్యత్యాసములున్నాయి. నమ్మడానికి నతనియేలుకు యేమి కష్టము కాలేదు (యోహాను 1:45-49). సందేహించు తోమా నిజానికి సందేహించలేదు గాని ఇంకా ఎక్కువ రుజువు కొరకు కాంక్షించాడు (యోహాను 20:25-28).

**మత్తయి సీమోనుల** కంటె భిన్నమైన వారుండరు. మత్తయి ద్వేషింపబడిన సుంకరి, పన్నులు వసూలు చేసేవాడు. రోమీయుల ఉద్యోగి. సీమోను జెలోతేలకు చెందినవాడు. రోమా ప్రభుత్వాన్ని వారి సేవకులను పడద్రోయడానికి పని చేసేవారు జెలోతేలు. నిజానికి ఈ జెలోతే ఉగ్రవాదులు పన్ను వసూలు చేసే ప్రతివానిని చంపబూనుకొన్న వారు. యేసు

న మక్షములో కాకుండా ఇంకో సందర్భములో సీమోను మత్తయిని కలసి కొన్నట్లయితే, బహుశ అతనిని కత్తితో పొడిచి చంపేసేవాడే.

ఈ మనుష్యులలో యున్న వ్యత్యాస వెంతయున్నదో! వీరు అంతకన్నా వ్యత్యాసం గల ఇంకో ఆరుగురితో జతకూర్చబడ్డారు. వారిలో ఎవ్వడు పరిపూర్ణుడు కాదు. గాని ప్రతివాడు తన సమస్యలను. కష్టాలను తనతో కూడ తెచ్చుకొన్నాడు. ఈ 12 మందిని గుమిగూడ్చితే వారు ఒండొరుల యెడల అనుమానం, అసూయకలిగినవారు.

ఇట్టివారిని యేసు ప్రభువు మలిచి ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన వాగ్దానమును నెరవేర్చు గుంపుగా తయారు చేసారు. వారు సర్వలోకానికి వెళ్లి సువార్త ప్రకటించాలని ఆయన ఆజ్ఞ యిచ్చారు. ఆయన చేసిన వాగ్దానము "ఇదిగో యుగసమాప్తి వరకు సదాకాలము నేను మీతో కూడ యుందును" (మత్తయి 28:18-20). ఈ ఆజ్ఞానుసారముగా, ఆయన వాగ్దానమును బట్టి వారాయన పనిని విజయవంతముగా కొనసాగించారు (కొలస్స 1:23).

యేసు యొక్క ఆజ్ఞను విన్న తరువాత ఆ పండ్రెండు మంది యెరూషలేములో కూడుకొని ప్రపంచములో ఒక్కొక్కడు ఒక భాగమునకు సువార్త చాటాలని నిశ్చయించుకొన్నారని యూసిబియస్ అను చరిత్రకారుడు వ్రాసాడు. నిజానికి వారిలో ప్రతివాడు తనది కాని దేశములో హతసాక్షులై మరణించారు.

అట్టి భిన్నమైన ప్రజలలో ఐక్యత, ఏకాగ్రత యేసు కలుగ జేయగలిగితే, మనకు నిరీక్షణ లేదా? యూదులను అన్యజనులను ఒకటిగా ఆయన చేయగలిగితే, మనకు అట్లు ఆయన చేయలేరా? (ఎఫెసీ 2:13-15). సహోదరుల మధ్య భిన్నాభిప్రాయములు, అపోహలు మనలను విడదీయనీయ కూడదు. మనం మానవ మాత్రులం, వ్యత్యాసాలు గల వారం అని మనం గ్రహించుకోవాలి. భిన్నాభిప్రాయముల వలన సంఘము కలతచెందకూడదు. వాటిని ఎట్లు పరిష్కరించుకోవాలో యేసు మనకు తెలియజేసారు (మత్త 5:22-24 18: 15-17). మన వ్యత్యాసములను బట్టి ఆయన రాజ్యములో ఉపయుక్తములైన పనిముట్లుగా మనలను తయారు చేయగల ఆయన శక్తియందు నమ్మిక యుంచుదాము. భిన్న స్వభావము గల వ్యక్తులను ఆయన ఏకం చేసారు. ఇప్పుడు చేయగలరు!

– ఏన్సిల్ జెంకిన్స్

యువక బృందము కూడ ఆ సంతోష సమయాన్ని రాగంపేట సంఘముతో గడిపిరి. రాగంపేటలో సోదరులు మల్లవరపు జోసఫ్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

2009 డిశంబరు 31వ తేదీ రాత్రి పై బృందము సత్యవాణి క్రీస్తు సంఘముతో అర్ధరాత్రి వరకు సంతోషముతో గడిపిరి. సండే స్కూలు పిల్లలు చిన్న చిన్న బైబిలు నాటికలు ప్రదర్శించిరి. సంఘమును ముగ్ధులు చేసిరి. అమెరికా యువక బృందము 2010 జనువరి 9వ తేదీ నాడు తమ స్వదేశమునకు పయనమై వెళ్లిరి.

2010 జనువరి 16వ తేదీ నాడు ఓదూరులో యున్న క్రీస్తు సంఘము తమ ఆలయ ప్రతిష్ట ప్రధము వార్షికోత్సవమును ఘనముగా నిర్వహించిరి. అక్కడ సోదరులు పులగలసుందర్రావు గారు సతీసమేతముగా పలు సంవత్సరముల నుండి సువార్త పని చేయుచున్నారు. గత సంవత్సర కాలములో ఓదూరు సంఘముతో 30 మంది బాప్తిస్మము పొంది చేర్చబడిరి. ఓదూరు సంఘములో సోదరులు బి. యల్. రాజు, శ్రీనివాస్ తదితర యువకులు చక్కటి తర్ఫీతు పొంది పాటలు నేర్పుటలోను, నడిపించుటలోను సమర్ధవంతముగా జరిగించుచున్నారు.

2010 జనువరి 18వ తేదీ సాయంత్రం జి. దొంతమూరులో జరిగిన సువార్త కూటములో రాయస్ ఫ్రెడరిక్ గారు, రిక్కీ గూటం గారు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. తదుపరి నూతన భవన నిర్మాణము కొరకు పునాది వేసిరి. అక్కడ సి. హెచ్. సుగుణ రావ్‌గారు పని చేయుచున్నారు.

2010 జనువరి 29 వ తేదిన శుక్రవారం కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తకుల సదస్సు జరిగెను. ఆ సదస్సును రిక్కీగూటం గారు సమర్ధ వంతముగా నడిపించిరి, సోదరులు యస్. యేసురత్నం, వి. చిన్నయ్య, జి. షద్రక్, వి. జిమ్‌ప్రకాశ్, రిక్కీగూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. రిక్కీగారు బైబిలు ప్రదేశముల చలన చిత్రమును ప్రదర్శించిరి, హాజరైన వారందరికీ మంచి భోజన సదుపాయము కల్పించిబడెను. కొందరికి ఇరవయ్యేసి చొప్పున బైబిళ్లు అందజేయబడెను.

# మీ కొక గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:


***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**



**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**


**To**


From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**



Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St, Kakinada - 533 004